## క్లుప్తంగా

### నేడు ప్రభుత్వ విప్ కొరముట్ల పర్యటన

ఓబులవారిపల్లె : వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును పంపిణీ కార్యక్రమనికి నేడు సోమవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొంటారని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో కార్యక్రమన్ని నిర్వహించన్నుట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యక్రమనికి హాజరుకావాలని ఆయన కోరారు.

### సుదర్శనశర్మకు సేవా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సుదర్శనశర్మ

రైల్వేకోడూరు : ఢిల్లీలోని ఆంధ్రభవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో జాతీయస్థాయి ఆదిలీలా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి ఉగాది వేడుకలు నిర్వహించారు. వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి భారతీయ రాష్ట్ర సమితి రాజ్యసభ్యులు లింగయ్యయాదవ్ ఉగాది విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన బండాత్మకూరు సుదర్శనశర్మకు జాతీయ స్థాయి ఉగాది విశిష్ట సేవా పురస్కారాన్ని అందజేశారు. పాతికేళ్ల నుంచి బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ పురస్కారం వచ్చిందని సుదర్శన శర్మ తెలిపారు.

### రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్‌గా రియాజుద్దిన్



రాయచోటి అర్బన్: రోటరీ డిస్ట్రిక్ట్ -3160 జోన్- 2 అసిస్టెంట్ గవర్నర్‌గా రాయచోటి పట్టణానికి చెందిన రియాజుద్దిన్‌ను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రియాజుద్దీన్ గత రెండు దశాబ్దాలుగా రోటరీ క్లబ్ సభ్యుడిగా ఉన్నారు. గతంలో రాయచోటి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా తన సేవలను గుర్తించి క్లబ్ పెద్దలు తనను అసిస్టెంట్ గవర్నర్‌గా నియమించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. క్లబ్‌సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

### నవోదయకు ఎంపికైన నలంద విద్యార్థి


వెంకటశివ

సిద్దవటం: మండల కేంద్రంలోని శ్రీ నలంద హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న బి. వెంకటశివ అనే విద్యార్థి జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మిప్రసన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ గత నెల ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి 2023-24 విద్యా సవంత్సరానికి గాను నవోదయ పాఠశాలలో 9వ తరగతికి సీటు సాధించారన్నారు. దీంతో పాఠశాల కరస్పాండెంటు బాలుగారి వెంకటసుబ్బయ్య, అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.

### సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలి


ఎన్‌టీఆర్ కాలనీలో చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

రాజంపేట టౌన్: సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అధికారి డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మండలంలోని ఎన్‌టీఆర్ కాలనీని దత్తత తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం విద్యార్థులు గ్రామంలో వివిధ ప్రాంతాల్లో చెత్త తొలగింపు పనులను చేపట్టారు. కార్యక్రమంలో రాజమోహన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవరుచుకోగలరని తెలిపారు. అంతేకాక సమాజంలోని ప్రజల జీవన శైలిపై అవగాహన పెంచుకునేందు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మదర్‌థెరిస్సాను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

# ఆలయాల వద్ద ఆధ్యాత్మిక శోభ

- మిట్టమీదపల్లెలో గంగమ్మ జాతర
- అనంతపురం గంగమ్మ ఆలయంలో భక్తుల సందడి
- రామాపురంలో బోనాల కార్యక్రమం


చిన్నమండెం: భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ


రాజంపేట రూరల్: గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి


లక్కిరెడ్డిపల్లె: అనంతపురం గంగమ్మ

రాజంపేట రూరల్ : గంగమ్మ జాతరను మండల పరిధిలోని మిట్టమీదపల్లి గ్రామంలోని దళితవాడలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకొని మిట్టమీదపల్లి పరిసర ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. గంగమ్మతల్లిని పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు, గాజులు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి రాజంపేట మండలంతోపాటు సమీప మండలాల ప్రజలు, భక్తులు వందలాదిగా తరలివచ్చారు. జాతరలో పెద్దఎత్తున మహిళలు పొంగళ్లు పొంగించుకొని మొక్కులు చెల్లించారు.

**జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ప్రత్యేక పూజలు**

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామ దేవతలను పూజించడం వలన గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చొప్పా ఎల్లారెడ్డి, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొల్లినేని రామ్మోహన్ నాయుడు, వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమ్మవారికి బోనాలు**

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురంలో ఆదివారం గ్రామ దేవత అయిన గంగమ్మకు గ్రామస్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపి మొక్కుబడులను చెల్లించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**అనంతపురం గంగమ్మ ఆలయంలో..**

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు రావడానికి రావడంతో క్యూ లైన్‌లో గంటల కొద్ది వేచి ఉండటంతో ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

**మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు**

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువైన మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

# మానవత సేవల విస్తరణకు కృషి


లక్కిరెడ్డిపల్లె: మాట్లాడుతున్న న్యాయవాది చెన్నకృష్ణ


రాయచోటి టౌన్: దాతలను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను మరింత విస్తృత పరుస్తామని రాయచోటి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో ఉపాధ్యక్షుడు సంచుల ఖాదర్ బాషా, సెక్రటరీ వెంకటరమణ నాయుడు, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సేవలను విస్తరించడానికి కృషి చేస్తామని చెప్పారు. అలాగే సమాజంలో ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి సన్మానిస్తామని తెలిపారు. ఈ క్రమంలో ఈ ఆదివారం బోపాల్ ఏయిమ్స్‌లో హౌస్ సర్జన్‌గా పని చేస్తున్న మన రాయచోటి ప్రాంతానికి చెందిన సిద్దయ్య నాయుడు, అనిత దంపతుల కుమారుడు శైలేష్ కుమార్‌ను సన్మానించారు. అలాగే ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ సిరికల్చర్ అధికారి అంకం జయచంద్రారెడ్డి, పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శివారెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

**మానవత సేవలు అభినందనీయం**

లక్కిరెడ్డిపల్లి: మానవతా సేవలు అభినందనీయమని న్యాయవాది వీరబల్లి చెన్నకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం నలంద పాఠశాలలో చైర్మన్ ఎస్.బాలసుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్, కో-చైర్మన్ శివశంకర్ రెడ్డి, అధ్యక్షుడు బి.రామాంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకృష్ణ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లిలో మానవత సేవా కార్యక్రమాలు, ఉచిత బాడీ ఫ్రీజర్లు, శాంతిరథం విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన, జాతరలో ఉచిత తాగునీరు, మజ్జిగ, కరోనా సమయంలో ప్రజలకు అనే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మానవత కో-చైర్మన్ ఎన్.శివశంకర్ రెడ్డి, శాంతి కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, బి.రామాంజనేయులు, ఏ.శివయ్య, పీసీ గోపాల్, శ్రీనివాసులు, వెంకటకృష్ణ, సి.విశ్వనాథ్, వి.సుబ్బారెడ్డి, పక్కీరయ్య, ధను, రవి కుమార్, రాజా, రాజేష్‌లు పాల్గొన్నారు.

### తిరునాలను విజయవంతం చేద్దాం

సంబేపల్లె : మే నెల మొదటి వారం జరగబోయే దేవరరాయి నల్లగంగమ్మ తిరునాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మునగా మరలీ స్వామి పిలుపునిచ్చారు. ఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని నల్లగంగమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల పెద్దలతో సమీక్ష నిర్వహించారు. తిరునాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. తిరునాలను నిర్వహించేందుకు దాతలు ముందుకు రావాలని వారు తెలిపారు. అందరి సహకారంతో వైభవంగా జరిపేందుకు సంసిద్ధమై ఉన్నామని తెలియజేశారు.


తిరునాల మహోత్సవంపై చర్చిస్తున్న దృశ్యం

## వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ఈనెల 28, 29 తేదీలలో పట్టణ పరిధిలో జరిగే ఆసరా వారోత్సవాలను జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా 3వ విడత కింద ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఈనెల 28వతేదీ ఉదయం 9గంటలకు 1,2,3,4,5,6,7,34 వార్డులకు పట్టణంలోని మార్కెట్ యార్డులోను, ఉదయం 10:30గంటలకు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో 8 నుంచి 16 వార్డులు, 26వ వార్డు పరిధిలోని సంఘాలకు వారోత్సవ సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29వతేదీ ఉదయం 9గంటలకు 28,29,30,31,32,33 వార్డులకు స్థానిక మార్కెట్ పాఠశాలలోను, ఉదయం 10.30 గంటలకు డైట్ కళాశాలలో 17 నుంచి 27వార్డుల పరిధిలోని వారికి సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, మెప్మా అధికారులు హాజరవుతారంటూ తెలిపారు. సమావేశానికి ఎస్‌హెచ్‌జీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు.

## సుభాష్ చంద్రబోస్ స్కౌట్ గ్రూప్ సేవలు అభినందనీయం


మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట): నందలూరులో సుభాష్ చంద్రబోస్ స్కౌట్ గ్రూపు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం రాత్రి రైల్వే కళాక్షేత్రంలో స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేపగుంట సాంరాజ్ నేతృత్వంలో వార్షికోత్సవ సభను నిర్వహించారు. యువ నాయకుడు మేడా విజయశేఖర్ రెడ్డి, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ సూర్యనారాయణ, రైల్వే మెడికల్ ఆఫీసర్ డా.జయభాస్కర్ రావు, ప్రముఖ రంగస్థల నటుడు హస్తవరం ఆనంద్‌కుమార్, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ పులి భాస్కరయ్య, మజ్దూర్ యూనియన్ బ్రాంచి సెక్రటరీ విశ్వనాథ్, సీనియర్ పాత్రికేయుడు దార్ల శ్రీనివాసాచారి, మాజీ ఎంపీటీసీ స్వామి ఏలుమలై, మాజీ స్కౌట్ ప్రెసిడెంట్ కమాల్‌బాషా, సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు చల్లా సురేంద్రబాబులు ప్రసంగించారు. ప్రధానంగా సంఘ సేవకుడు సాంరాజ్ చేస్తున్న రెండు దశాబ్దాలుగా అందిస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. నేటి యువతకు సామాజికసేవను అలవర్చే విధంగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అంతకముందుగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు రిజర్వేషన్


రమాదేవి

రాయచోటి టౌన్ : ప్రైవేట్ పాఠశాలలో పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, వెనుకబడిన ఓసీ విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 25 శాతం రిజర్వేషన్ కల్పించారని రాయచోటి మండల విద్యాశాఖాధికారి రమాదేవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 1వ తరగతిలో చేరేందుకు విద్యార్థులు ఏప్రిల్ 13వ తేదీ వరకు ఆన్‌లైన్ (మీసేవ కేంద్రాలు)లలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నిరుపేదలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీ వారికి 10 శాతం, ఎస్టీ వారికి 4శాతం, బీసీ ఇతర వెనుకబడిన వర్గాలకు 6 శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నట్లు తెలిపారు. వీరి ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారైతే రూ.1.2లక్షలు, పట్టణ వాసులైతే రూ.1.44 లక్షలకు మించి ఉండరాదన్నారు. ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 13వ తేదీ లాటరీ పద్ధతి ద్వారా ఎన్నుకోబడుతారని తెలిపారు. ఎన్నికైన విద్యార్థులు ఏప్రిల్ 15వ తేదీ నుంచి 21వ తేదీలోగా ఎంపిక చేసుకున్న పాఠశాలలో చేరాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు అయితే రూ.6500లు, పట్టణ వాసులకు అయితే రూ.8000లు ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టు ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని కడప-చెన్నై ప్రధాన రహదారిలోని భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన భవనాన్ని ఆదివారం చైర్‌పర్సన్ దీపం లక్ష్మీదేవి ప్రారంభించారు. గతంలో ఉన్న బంకు పూర్తిగా దెబ్బతినడంతో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డిసొంత నిధులతో గది ఏర్పాటు చేశారని మార్కెట్ కమిటీ కార్యదర్శి సుజాత పేర్కొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్‌శ్రీధర్‌రెడ్డిని, మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య సత్కరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, బొగ్గిడివారిపల్లె ఉప సర్పంచ్ ఎల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మురళీమోహన్‌రెడ్డి, క్రిష్ణయ్య, ప్రసాద్, భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మారెడ్డి, ప్రదీప్ సాగర్, రామమూర్తి నాయుడు, దిలీప్, చిన్నపరెడ్డి, చంద్రాయుడు, రామిరెడ్డి, మచ్చా సుబ్బరాయుడు, సర్దార్, మల్లారెడ్డి, వంకర జగన్, సాదక్, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉక్కపోత.. ఉక్కిరిబిక్కిరి


- భగ్గుమంటున్న ఎండలు
- చెమటతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పెరిగిన ఫ్యాన్లు, ఏసీల వాడకం
- గాలిలో తేమశాతం అధికమవ్వడమే కారణం

రాయచోటి: ఎండలు భగ్గుమంటున్నాయి. అదే స్థాయిలో వడగండ్లతో కూడిన వర్షాలు, ఈదురు గాలులతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకవైపు వర్షాలు కురుస్తున్నా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం 37 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయ్యింది. ఎండ వేడిమితో ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఫ్యాన్లు, ఏసీల కింద కూర్చొనిదే ఉండలేని పరిస్థితి నెలకొంది. బయట తిరిగి పనులు చేసుకునే వారికి చెమటలతో ముద్దవుతున్నారు. వాతావరణంలో తేమ 55శాతం నుంచి 95శాతం ఉండడమే దీనికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

**వర్షాలు కురుస్తున్నా ఉక్కపోత**

వానాకాలంలోనూ ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఇటీవల వర్షాలు పుష్కలంగా కురవడంతో వాగులు, వంకలు పారుతున్నాయి. పలుచోట్ల చెరువులు, కుంటలు నిండుకుండలా కనిపిస్తున్నాయి. జలాశయాల్లోకి నీరు చేరి మొక్కలు పెరిగి పచ్చదనం పెరిగినప్పటికీ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడిమి, విపరీతమైన ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. వేసవిలో లాగా ఇళ్లల్లో, కార్యాలయాలలో ఫ్యాన్లు గిర్రున తిరుగుతున్నా ఏసీలు ఆన్ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో రోజూ వర్షాలు కురుస్తున్నా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఆదివారం అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 37, అత్యల్పంగా 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో తేమశాతం 55 నుంచి 95 శాతం ఉండటంతో ఉక్కపోత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో మధ్యాహ్నం వేళల్లో జనం బయటకు వెళ్లకుండా ఇండ్లకే పరిమితమవుతుండటంతో చాలా చోట్ల రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల ఉపరితల ద్రోణులు సంభవిస్తుండగా వాటి ప్రభావం లేని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత అధికంగా ఉంటుంది.

**జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదమే..**



రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదం తప్పదు. ఎక్కువ ఎండలు ఉన్న సమయంలో ప్రజలు అత్యవసరం అయితే తప్పా బయట తిరగడం తగ్గించాలి. వీలున్నంత వరకు నీళ్లు ఎక్కువగా తాగడం మంచిది. వేసవిని దృష్టిలో ఉంచుకొని కాటన్ బట్టలను వినియోగించడం ఉత్తమం. గుండె జబ్బులు, ఇతర వ్యాధులు ఉన్న వ్యక్తులు వేసవిలో జాగ్రత్తలు పాటించడంతోపాటు ఏమాత్రం ఆరోగ్య ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ భాస్కర్ రెడ్డి, ఎండీ, ప్రభుత్వ వైద్యులు

# ఎస్టీ రిజర్వేషన్లపై హర్షాతిరేకాలు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకుంటున్న వాల్మీకి బోయలు

మదనపల్లె : ఏడు దశాబ్దాలకుపైగా వాల్మీకి, బోయలు ఎదురుచూస్తున్న ఎస్టీ రిజర్వేషన్‌పై ఇచ్చిన మాట నిలుపుకున్నందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక చిత్తూరుబస్టాండ్‌లోని వాల్మీకిమహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వాల్మీకి, బోయలు ఎస్టీ పునరుద్ధరణపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బాణాసంచా పేలుళ్లతో సంబరాలు జరుపుకున్నారు. జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులు మాట్లాడుతూ...ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రతిపక్షనాయకుడి హోదాలో వాల్మీకి,బోయల స్థితిగతులను ప్రత్యక్షంగా గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరకాల కోరిక నెరవేర్చడమే కాకుండా అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకి, బోయల స్థితిగతులపై అధ్యయనానికి రిటైర్డ్ ఐఏఎస్ శ్యామూల్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్యకమిషన్‌ను నియమించి, ఆయన అందించిన నివేదిక ఆధారంగా అసెంబ్లీలో కేబినెట్ సమావేశంలో ఎస్టీ జాబితాలో పునరుద్ధరించేందుకు తీర్మానం చేస్తూ కేంద్రానికి పంపడం అభినందనీయమన్నారు. ఈ బిల్లును కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో ఆమోదం తెలిపేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు సహకరించి, న్యాయం చేస్తే జీవితాంతం వాల్మీకి, బోయలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకిసంఘం నాయకులు దొడ్డిపల్లె ఆనంద్, బోయవీధి రాధాకృష్ణ, పాకాలహరి, కట్టుబావిచలపతి, పెదరాయుడు నరసింహులు, బసినికొండ చలపతి, శివరాజ్, వెంకటస్వామి, బసప్ప, గంగిరెడ్డి, శంకర, సూరి, కార్తీక్, రాము, కనుగొండశ్రీనివాసులు, వెంకటేష్, మోహన, రమణ తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు

పీలేరు రూరల్ : స్థానిక సదుం రోడ్డు మార్గంలోని శ్రీ కల్యాణ సీతారామస్వామి ఆలయంలో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కె. రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి జలాభిషేకం, రాత్రి 7.30 ధ్వజారోహణం, గణపతి హోమం, సుదర్శన హోమం, శ్రీరామ మూలమంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రకాశం రోడ్డులోని కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు రెండు రోజుల పాటు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

### 27, 28 తేదీలలో రిలే దీక్షలు



మాట్లాడుతున్న శ్రీనివాసులు, రంగారెడ్డిలు

రాయచోటి అర్బన్ : పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించకుండా పూర్తిస్థాయిలో నిర్మించాలన్న డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లానేత వంగిమళ్ళ రంగారెడ్డిలు అన్నారు. ఆదివారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పోలవరం నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించడంతో పాటు పునరావాసం కల్పించాలంటూ కోరారు. పై డిమాండ్లతో 2రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా మహిళా సమైక్య నాయకురాలు మర్రి సుమిత్ర, పట్టణ నాయకురాళ్లు సునీత, అరుణ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి


కార్యక్రమానికి గిరిజనులను ఆహ్వానిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : బోయ, బంతు, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాలను నిరసిస్తూ సోమవారం నిర్వహింప తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్ పిలుపునిచ్చారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి గిరిజనులంతా పెద్ద ఎత్తున కలసిరావాలంటూ ఆయన ఆదివారం లంబాడా సంఘం నేతలు శంకర్‌నాయక్, బిల్లునాయక్‌లతో కలసి సుండుపల్లె, సంబేపల్లె మండలాల్లోని పలు గిరిజన తండాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేకుండా కొండ, కోనల్లో జీవిస్తున్న గిరిజనులకు మౌలిక వసతుల కల్పన కలగా మారిందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన గిరిజనులను పాలకులు ఆదుకోకపోగా తిరిగి ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో బోయ, వాల్మీకిలను చేర్చాలని చూస్తుండటం దారుణమన్నారు. పాలకులు వెంటనే గిరిజనులకు అన్యాయం చేసే ఈ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

గాలివీడు : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఆదివారం నూలివీడులో మద్దిరాల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె ఆధ్య ఆసుపత్రి వారిచే కంటి, కిడ్నీ, మూత్రకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించి, మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన అభినందించారు. వైద్య శిబిరంలో వైద్యాధికారులు 400 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉమాపతి రెడ్డి, ఉమాప్రభాకర్, ఎంపీటీసీలు అమానుల్లా, గడ్డం చంద్రప్రకాష్ రెడ్డి, పేరం జనార్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, ఎస్ఆర్ బాషా, వల్లెపు నగేష్, మద్దిరాల శేఖర్‌రెడ్డి, జల్లా ధనుంజయ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

రాజంపేట : ఏప్రిల్ 5న చలో పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టర్ల విడుదల కార్యక్రమాన్ని రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, కెవీపీఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, కెవీపీఎస్ జిల్లా కన్వీనరు ఓబిలి పెంచలయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వేపల్లె నరసింహ, రైతులు వలిమి నాగయ్య, కొమ్ము శంకరయ్యతో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

### శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలో ఉపగ్రహ ప్రయోగం వీక్షించేందుకు మదనపల్లెకు చెందిన విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లారు. డిపో -2 నుంచి 20 ప్రత్యేక సర్వీసులలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు శ్రీహరికోటకు వెళ్లినట్లు డీఎం ఆర్సీ నిరంజన్ తెలిపారు. అలాగే నేలపట్టు (పక్షుల రక్షిత కేంద్రం)ను కూడా సందర్శించినట్లు తెలిపారు.